సాక్షి
విశాఖపట్నం
సోమవారం । 21 । ఏప్రిల్ । 2025



కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో డీఆర్‌ఎం తనిఖీలు 8లో



నాటి సంస్కరణలే.. నేటి ఫలితాలు 8లో



ఉత్కంఠగా చెస్ పోటీలు 8లో

● సిద్ధంగా ఉన్నాం.. స్పందించరా.?

పర్యాటకంపై పట్టింపేదీ?



- జీఐఎస్–2023 సదస్సులో టూరిజం ప్రాజెక్టులకు భారీ ఒప్పందాలు
- జిల్లాలో 64 పర్యాటక ప్రాజెక్ట్‌లు.. రూ.8,806 కోట్ల పెట్టుబడులకు అంగీకారం
- ఒబెరాయ్, మై ఫెయిర్ హోటల్స్ మినహా మిగిలిన ప్రాజెక్టులపై శీతకన్ను
- భూ కేటాయింపులు చేస్తే పనులు ప్రారంభిస్తామంటున్న పెట్టుబడిదారులు
- అయినా పట్టించుకోని కూటమి ప్రభుత్వం

కూటమి ప్రభుత్వం పర్యాటక రంగాన్ని విస్మరిస్తోంది. కొత్త ప్రాజెక్టులపై దృష్టిసారించడం లేదు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో 2023లో జరిగిన గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్‌లో ఎంవోయూలపై కనీసం ఒక్కసారైనా సమీక్ష నిర్వహించలేదు. ఒప్పందాలు చేసుకున్న సంస్థలు భూములిస్తే పనులు ప్రారంభిస్తామని అడుగుతున్నా స్పందించడం లేదు. ఫలితంగా అద్భుత ప్రాజెక్టుల రాకపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి.

సాక్షి, విశాఖపట్నం : విశాఖ పర్యాటకాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు గత ప్రభుత్వం అవకాశాలు అన్వేషించింది. అన్ని వర్గాల పర్యాటకులను మరింత ఆకర్షించేందుకు రిక్రియేషన్ అండ్ అడ్వెంచర్ టూరిజానికి శ్రీకారం చుట్టింది. దీంతో ఈ విభాగంలో భారీగా పెట్టుబడులు పెట్టి.. సరికొత్త పర్యాటక ప్రాజెక్టులను ఏర్పాటు చేసేందుకు సింగపూర్, టర్కీ, ఫ్రాన్స్ తదితర దేశాలు ఆసక్తి చూపించాయి. ఇందులో భాగంగా గత ప్రభుత్వ హయాంలో జరిగిన జీఐఎస్–2023లో ఉమ్మడి విశాఖ జిల్లాలో మొత్తం రూ.8,806 కోట్ల విలువైన 64 ప్రాజెక్టులు ఏర్పాటుకు కీలక ఎంవోయూలు జరిగాయి. ప్రాజెక్టులు పట్టాలెక్కే సమయంలో ప్రభుత్వం మారిపోయింది. కూటమి ప్రభుత్వం ఈ ఎంవోయూలపై ఒక్కసారైనా సమీక్ష నిర్వహించలేదు సరికదా.. భూములిస్తే పనులు ప్రారంభిస్తామని ఎంవోయూలు చేసుకున్న సంస్థలు అడుగుతున్నా పట్టించుకోవడం లేదు.

స్థలం చూపించండి.. పనులు ప్రారంభిస్తాం..?

జీఐఎస్–2023లో ఎంవోయూలు కుదుర్చుకున్న 64 సంస్థలు తమ ప్రాజెక్టులు గ్రౌండింగ్ చేస్తే.. విశాఖ జిల్లా పర్యాటకం ప్రపంచ స్థాయికి చేరుకోనుంది. ప్రభుత్వం మారినప్పటి నుంచి పర్యాటక శాఖ కార్యాలయాల చుట్టూ ఆయా సంస్థల ప్రతినిధులు కాళ్లరిగేలా తిరుగుతున్నారు. స్థలం చూపిస్తే కచ్చితంగా పనులు ప్రారంభించి ప్రాజెక్టులను వీలైనంత త్వరగా ప్రారంభిస్తామని మొరపెట్టుకుంటున్నారు. స్థానిక పర్యాటక శాఖ అధికారులను పలువురు పెట్టుబడిదారులు సంప్రదించారు. తమ చేతుల్లో ఏమీ లేదు.. ,ఉన్నతాధికారులను కలవాలని సమాధానం చెప్పడంతో అమరావతికి పయనమయ్యారు. అక్కడా వీరికి చుక్కెదురైంది. ఇప్పట్లో భూ కేటాయింపులేవీ ఉండేలా లేవని ఉన్నతాధికారులు స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. మరో వైపు పర్యాటక శాఖ మంత్రి దుర్గేష్ కూడా చేతులెత్తేశారంటూ పెట్టుబడిదారులు వాపోతున్నారు.

కూటమి కుట్ర పన్నుతోంది..!

ఇప్పటికే ఒప్పందం కుదుర్చుకొని రెండేళ్లు గడిచిన నేపథ్యంలో కూటమి ప్రభుత్వం కొత్త ఎత్తుగడ వేస్తోంది. మరో ఏడాది కాలం భూ కేటాయింపులేవీ చేయకుండా గాలికొదిలేయాలని భావిస్తోంది. తర్వాత ఈ ఒప్పందాలన్నింటినీ రద్దు చేసేందుకు పన్నాగం పన్నుతోందని పర్యాటక వర్గాల సమాచారం. గతంలో పెట్టుబడులు సదస్సుల పేరుతో ఫేక్ ఎంవోయూలు చేసుకొని ఒక్క ప్రాజెక్టు కూడా రాకుండా కాలం వెళ్లదీసింది. ఇప్పుడు కూడా పక్కాగా వచ్చే ప్రాజెక్టులను కాళ్లదన్ని.. తమ అనుయాయులకు టూరిజం ప్రాజెక్టుల పేరుతో భూ కేటాయింపులు చేయాలని చంద్రబాబు అండ్ కో వ్యూహరచన చేస్తోంది. ఈ ప్రాజెక్టులన్ని గ్రౌండింగ్ అయితే వైఎస్సార్ సీపీకి పేరొస్తుందనే ఉద్దేశంతో మీనమేషాలు లెక్కిస్తోంది. గత ప్రభుత్వ హయాంలోనే ఒబెరాయ్, ఇనార్బిట్ మాల్, మైఫెయిర్ వంటి దిగ్గజ సంస్థల నిర్మాణాలకు భూమి పూజ జరిగింది. ఇప్పుడు ఆ ప్రాజెక్టులు మినహా మిగతా అన్ని ప్రాజెక్టులకూ మంగళం పాడేందుకు కూటమి కుట్రలు మొదలుపెట్టిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రాజెక్టులొస్తే ఉపాధి అవకాశాలు

ఉమ్మడి విశాఖ జిల్లాలో పర్యాటక అవకాశాలు పుష్కలంగా ఉన్న ప్రతి ప్రాంతంలోనూ ప్రాజెక్టులు ఏర్పాటు చేసేందుకు వివిధ సంస్థలు ముందుకొచ్చాయి. మొత్తంగా పర్యాటక రంగానికి సంబంధించి గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్‌లో రాష్ట్ర వ్యాప్తంగా రూ.21,941 కోట్లతో 129 ప్రాజెక్టులకు ఎంవోయూలు జరగగా.. ఇందులో సగం వరకూ అంటే 64 ప్రాజెక్టులు ఉమ్మడి విశాఖకు సంబంధించినవి కావడం విశేషం. మొత్తం రూ.8,806.44 కోట్లతో విభిన్న రకాల ప్రాజెక్టులకు ఎంవోయూలు జరిగాయి. ఇవన్నీ వస్తే జిల్లాలో ప్రత్యక్షంగా 18,205 మందికి, పరోక్షంగా మరో 20 వేల మందికి ఉపాధి అవకాశాలు కలగనున్నాయి.



ఉమ్మడి విశాఖ జిల్లాలో 1,139 పోస్టులు

- జోనల్ స్థాయిలో మరో 400 పోస్టులు
- డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల
- దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం
- జూన్ 6 నుంచి జూలై 6 వరకు పరీక్షలు

విశాఖ విద్య: వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన నోటిఫికేషన్‌ను రద్దు చేసిన కూటమి ప్రభుత్వం ఎట్టకేలకు ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి సిద్ధమైంది. ఆదివారం డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఉమ్మడి విశాఖ జిల్లాకు సంబంధించి ప్రభుత్వ, జెడ్పీ, ఎంపీ, మున్సిపల్ మేనేజ్‌మెంట్ పరిధిలోని పాఠశాలల్లో 734 పోస్టులు, గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆశ్రమ పాఠశాలల్లో 400 పోస్టులు భర్తీ చేయనున్నారు. పాఠశాల విద్యాశాఖ పరిధిలోని జువనైల్ హోమ్‌లో ఐదు ఖాళీలు ఉన్నట్లు వెల్లడించారు. మొత్తంగా ఉమ్మడి విశాఖ జిల్లా పరిధిలో 1,139 పోస్టులు భర్తీ చేయనున్నట్లు నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. ఇవి కాకుండా జోనల్ స్థాయిలో ఏపీ రెసిడెన్షియల్/మోడల్ స్కూల్స్/ సోషల్ వెల్ఫేర్/బీసీ వెల్ఫేర్/ట్రైబల్ వెల్ఫేర్(గురుకులాలు) పరిధిలోని విద్యాలయాల్లో 400 పోస్టులను భర్తీ చేయనున్నారు.

రోస్టర్ పాయింట్లు ప్రకటించిన జిల్లా విద్యాశాఖ

ఉమ్మడి విశాఖ జిల్లా ప్రాతిపదికన ఉపాధ్యాయ పోస్టుల భర్తీ జరగనుంది. విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లోని విద్యాలయాల్లో సబ్జెక్టుల వారీగా ఎన్ని ఖాళీలు ఉన్నాయనేది విద్యాశాఖాధికారులు ఇప్పటికే లెక్క తీశారు. మండల పరిషత్, జెడ్పీ, మున్సిపల్ మేనేజ్‌మెంట్ల వారీగా రోస్టర్ పాయింట్లు సైతం ప్రకటించారు. ప్రభుత్వ/జెడ్పీ/ఎంపీ/మున్సిపల్ మేనేజ్‌మెంట్ పరిధిలో భర్తీ చేయనున్న 734 పోస్టుల్లో 290 ఓపెన్ కేటగిరీ కోసం కేటాయించారు. ఈ పోస్టులకు ఎవరైనా పోటీ పడవచ్చు. బీసీ ఏ–42, బీసీ బీ–65, బీసీ సీ–6, బీసీ డీ–44, బీసీ ఈ –26, ఎస్సీ గ్రూప్ 1–26, ఎస్సీ గ్రూప్ 2–7, ఎస్సీ గ్రూప్ 3–36, ఎస్టీ–37, ఈడబ్ల్యూఎస్–65 పోస్టులు కేటాయించారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్ మేరకు ఏఏ సబ్జెక్టుల్లో ఎన్ని పోస్టులు కేటాయించామనేది స్పష్టత ఇస్తూ.. జిల్లా విద్యాశాఖ వెబ్‌సైట్‌లో ఇందుకు సంబంధించిన వివరాలను అందుబాటులో ఉంచారు.

షెడ్యూల్ ఇలా.. : 2024 జూలై 1 కటాఫ్‌గా 18 నుంచి 44 సంవత్సరాల మధ్య వయసు గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. రిజర్వ్‌డ్ కేటగిరీల వారికి మరో ఐదేళ్లు సడలింపు ఇచ్చారు. తగిన విద్యార్హతలు ఉన్న వారు మే 15 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. గత నోటిఫికేషన్ సమయంలో దరఖాస్తు చేసుకున్న వారు ఎటువంటి ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదు. కానీ వారంతా కొత్తగా దరఖాస్తు ఫారాన్ని నింపి వెబ్‌సైట్‌లో సబ్మిట్ చేయాలి. అయితే అర్హతల మేరకు మరేదైనా సబ్జెక్టు కోసం పరీక్ష రాయాలనుకుంటే.. తగిన ఫీజు చెల్లించి, మళ్లీ దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. జూన్ 6 నుంచి జూలై 6 వరకు పరీక్షలు నిర్వహించనున్నారు.



పౌరగ్రంథాలయంలో పరీక్షకు సిద్ధమవుతున్న ఉపాధ్యాయ అభ్యర్థులు

సబ్జెక్టుల వారీగా ఖాళీలు ఇలా..

ఎస్‌ఏ లాంగ్వేజీ-1	26
హిందీ	28
ఇంగ్లిష్	55
గణితం	59
ఫిజికల్ సైన్స్	39
బయాలజీ	58
సోషల్	91
పీఈటీ	139
ఎస్జీటీ	239
మొత్తం	734

ట్రైబల్ వెల్ఫేర్‌లో..

ఎస్‌ఏ తెలుగు	7
హిందీ	11
గణితం	7
ఫిజికల్ సైన్సు	35
సోషల్	5
ఎస్జీటీ	335
మొత్తం	400

జువనైల్ విభాగంలో

ఎస్జీటీ	4
పీఈటీ	1

జోనల్ పరిధిలో పోస్టులు ఇలా..

ఉత్తరాంధ్రలోని రెసిడెన్షియల్ విద్యాలయాల్లో జోనల్ ప్రాతిపదికన 400 పోస్టులు భర్తీ చేయనున్నారు.

పీజీటీ	73	పీడీ	6
టీజీటీ	299	పీఈటీ	22

ఐటీ కంపెనీకి భూముల కేటాయింపులో అవినీతి?

- మంత్రి లోకేష్‌పై జనజాగరణ సమితి ధ్వజం
- చెవిలో పూలు పెట్టుకుని వినూత్న నిరసన

ఎంవీపీకాలనీ: రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ బాబూ.. ఉత్తరాంధ్రుల చెవిలో పూలు పెట్టొద్దంటూ జనజాగరణ సమితి ఆధ్వర్యంలో వినూత్న నిరసన చేపట్టింది. ఇటీవలే పుట్టుకొచ్చిన ఉర్సా క్లస్టర్స్ ఐటీ కంపెనీకి విశాఖలో 60 ఎకరాల భూమిని కారుచౌకగా కేటాయించడాన్ని వ్యతిరేకిస్తూ.. సమితి నాయకులు చెవిలో పూలు పెట్టుకొని నిరసన తెలిపారు. ఎంవీపీ కాలనీలో ఆదివారం ఉదయం ఈ కార్యక్రమంలో సమితి నగర కన్వీనర్ చింతపల్లి సునీల్‌కుమార్ మాట్లాడారు. నిరుద్యోగులకు ఐటీ ఉద్యోగాలు అని చెప్పి.. కేవలం 2 నెలల కిందట ఆవిర్భవించిన కంపెనీకి విశాఖలో రూ.3 వేల కోట్లు విలువైన భూములను ఎలా కేటాయిస్తారని ప్రశ్నించారు. కావాలనే లోకేష్ ఈ నకిలీ కంపెనీకి విలువైన భూములు కేటాయించాలని చూస్తున్నారని ఆరోపించారు. ఈ వ్యవహారంలో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని, వెంటనే ఈ కేటాయింపులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై పోరాటానికి ఉత్తరాంధ్ర విద్యార్థి, యువజన సంఘాలు నడుం కట్టాలని పిలుపునిచ్చారు. సమితి నాయకులు వాసు, దేవర శంకర్ తదితరులు పాల్గొన్నారు.



చెవిలో పూలు పెట్టుకొని నిరసన వ్యక్తం చేస్తున్న జనజాగరణ సమితి నాయకులు

చందనం చెక్కల సిద్ధం

సింహాచలం: ఈనెల 24 నుంచి శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో తొలి విడత చందనం అరగదీత కార్యక్రమం వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈమేరకు ఆదివారం అరగదీతకు అణువుగా చందనం చెక్కలను ముక్కలుగా కోశారు. దేవస్థానం ఈవో కె.సుబ్బారావు, ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ఏఈవో ఎస్.ఆనంద్‌కుమార్, సూపరింటెండెంట్ ప్రసాద్ సమక్షంలో చందనం చెక్కలను తూకం వేశారు. ఈనెల 30న వైశాఖ శుద్ధ తదియని పురస్కరించుకుని ఆ రోజు స్వామికి తొలివిడతగా 125 కిలోల పచ్చి చందనాన్ని సమర్పిస్తారు.



చందనం చెక్కలను ముక్కలుగా కోస్తున్న దేవస్థానం ఉద్యోగి సాంబ

ఐఐఎంవీలో అడ్వాన్స్‌డ్ స్ట్రాటజిక్ ప్రోగ్రాం ప్రారంభం

తగరపువలస: గంభీరంలోని ఐఐఎంవీలో ఆదివారం అడ్వాన్స్‌డ్ స్ట్రాటజిక్ హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్‌లో ఆన్‌లైన్ ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ ప్రోగ్రాం రెండో బ్యాచ్ ప్రారంభమైంది. అత్యాధునిక డిజిటల్ సాధనాలతో శక్తివంతం చేయడానికి 70 గంటల సమగ్ర అధ్యయనానికి ఈ కార్యక్రమం రూపొందించినట్టు నిర్వాహకులు తెలిపారు. ఆర్గనైజేషనల్ బిహేవియర్ అండ్ హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రాం డైరెక్టర్ బిశాకా మంజుదార్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ ప్రొఫెసర్ అమిత్ బరన్ చక్రవర్తి, అధ్యాపకుడు శ్రీనివాస్ జ్యోష్యులా, ప్రొఫెసర్ ప్రిన్స్ డోలియా తదితరులు పాల్గొన్నారు.

ఏయూ వైపు విదేశీ చూపు



ఆంధ్ర యూనివర్సిటీలో చదువుకున్న విదేశీ విద్యార్థులు

ఆంధ్ర యూనివర్సిటీలో ఒకప్పుడు కొన్ని ప్రత్యేక కోర్సులకే పరిమితమైన విదేశీ విద్యార్థుల సంఖ్య ఇప్పుడు అనూహ్యంగా పెరిగింది. ఏకంగా 59 దేశాలకు చెందిన 1,130 మంది విద్యార్థులు ఇక్కడ విద్యాభ్యాసం చేస్తున్నారు. కేవలం ఐదేళ్లలో ఈ సంఖ్య రెండింతలు కావడం విశేషం. దేశంలోని మరే ఇతర విశ్వవిద్యాలయంలోనూ ఇంత మంది విదేశీ విద్యార్థులు లేకపోవడం ఏయూను అంతర్జాతీయ విద్యా కేంద్రంగా నిలబెడుతోంది. ప్రత్యేక హాస్టళ్లు, వారికి నచ్చిన ఆహారం, వంటి సౌకర్యాలు ఇక్కడకు మరింత మందిని ఆకర్షిస్తున్నాయి. నగరంలోని ప్రశాంతమైన వాతావరణం, ప్రకృతి అందాలు కూడా తోడవడంతో ఆంధ్ర యూనివర్సిటీ.. మినీ ప్రపంచాన్ని తలపిస్తోంది. – విశాఖ విద్య

- గ్లోబల్ విద్యార్థులతో వర్సిటీలో జోష్
- 59 దేశాలకు చెందిన 1,130 మంది విద్యాభ్యాసం
- ఏయూకు క్రేజ్ పెంచిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం
- ఈ నేపథ్యంలోనే అంతర్జాతీయ ఖ్యాతి

ఆంధ్ర యూనివర్సిటీలో విదేశీ విద్యార్థులు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నారు. ప్రస్తుతం 59 దేశాలకు చెందిన 1,130 మంది విద్యార్థులు ఇక్కడ విద్యనభ్యసిస్తున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి విద్యారంగానికి ఇచ్చిన ప్రాధాన్యతకు తోడు విశాఖ బ్రాండ్ ఇమేజ్‌ను పెంచేలా తీసుకున్న చర్యలతో ఆంధ్ర యూనివర్సిటీ వైపు విదేశీ విద్యార్థులు ఆకర్షితులయ్యారు. 2019–20 విద్యా సంవత్సరంలో 190 మంది విదేశీ విద్యార్థుల చేరగా.. 2024–25 నాటికి ఆ సంఖ్య 465కు చేరింది. ఒకే ఏడాదిలో ఎక్కువ సంఖ్యలో విదేశీ ప్రవేశాలు పొందిన యూనివర్సిటీగా ఏయూ రికార్డు సొంతం చేసుకుంది. అంతే కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా నిర్వహించే యూనివర్సిటీల్లో విదేశీ విద్యార్థులు ఎక్కువ మంది చదువుకునేది ఏయూలోనే కావడం గమనార్హం.

ప్రత్యేక హాస్టళ్లు

ఆంధ్ర యనివర్సిటీలో చదువుకునేందుకు వచ్చే విదేశీ విద్యార్థులకు ఆహారం విషయంలో కొంత ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. వర్సిటీలో ప్రవేశాలు పొందే వారిలో 70 శాతం మంది విద్యార్థులు క్యాంపస్ హాస్టళ్లలో ఉండేందుకే మొగ్గు చూపుతున్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని వీరి కోసమని ప్రత్యేకంగా వర్సిటీలో ఏడు హాస్టళ్లు అందుబాటులో తీసుకొచ్చారు. వారికి నచ్చిన వంటకాలు తయారు చేసుకునేలా ఇంటర్నేషనల్ స్టూడెంట్ ఎఫైర్స్ విభాగం డీన్ ఆచార్య ధనుంజయరావు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వర్సిటీలో అంతర్జాతీయ వ్యవహారాల విభాగం విద్యార్థుల చదువులతో పాటు, వారి సదుపాయాలపై కూడా నిరంతరం పర్యవేక్షణ చేస్తుండటంతో.. వారి చదువులు సాఫీగా సాగిపోతున్నాయి.

సినిమాల్లోనూ అవకాశాలు

ఆంధ్ర యూనివర్సిటీలో చదువుకుంటున్న విదేశీ విద్యార్థులకు సినిమాల్లోనూ అవకాశాలు వెతుక్కుంటూ వస్తున్నాయి. ఇటీవల కాలంలో విశాఖ నగరంతో పాటు, పరిసర ప్రాంతాల్లో సినిమా షూటింగ్‌కు ఎక్కువగా జరుగుతుండటంతో వీటిలో విదేశీ విద్యార్థులకు అవకాశాలు దక్కుతున్నాయి. ఓ సినిమాలో కంబోడియాలో చిక్కుకుపోయిన 25 మంది యువతను వైజాగ్‌కు తీసుకొచ్చే సన్నివేశాన్ని ఇక్కడి విద్యార్థులతోనే చిత్రీకరించారు.. ఇక్కడి ఆఫ్రికన్ విద్యార్థుల బృందం.. హీరో సూర్య నటించిన చిత్రంలో మాదకద్రవ్యాల వ్యాపారం చేసే విలన్ సహచరుల పాత్రల్లో నటించింది. త్వరలో ఆంధ్ర యూనివర్సిటీ శతాబ్ది ఉత్సవాలు ప్రారంభమవుతుండగా.. వీటిలో విదేశీ విద్యార్థులు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నారు.

ఇదే జోష్ ఉంటుందా?

కూటమి ప్రభుత్వం ఆంధ్ర యూనివర్సిటీపై శీతకన్ను వేస్తోంది. విశాఖలోని ఓ ప్రైవేట్ యూనివర్సిటీని బలోపేతం చేసేలా పరోక్షంగా సహకారమందిస్తోంది. విశాఖలోని ఆ ప్రైవేటు యూనివర్సిటీలో చేరితేనే మేలు అన్నట్లుగా ఏయూ పాలనాధికారులతో పాటు ఓ వర్గం వ్యవహరిస్తుందనే విమర్శలు సైతం ఉన్నాయి. ఈ ప్రభావం 2025–26 విద్యా సంవత్సరం అడ్మిషన్లపై పడుతోందని వర్సిటీ మేలు కోరే వారు అంటున్నారు. ఫలితంగా విదేశీ విద్యార్థుల జోష్ ఉంటుందా..? అనేది వేచి చూడాలి.

చదువుతో పాటు భద్రతకు ప్రాధాన్యం



ఆంధ్ర యూనివర్సిటీలో చదువుకోవాలనే కోరికతో విశాఖకు వచ్చే విదేశీ విద్యార్థుల నమ్మకాన్ని నిలబెడుతూ విద్య అందిస్తున్నాం. ఇక్కడ వారికి ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశాం. ఎలాంటి సమస్య ఎదురైనా వెంటనే స్పందించి.. వారికి తోడుగా నిలిచేలా ఇంటర్నేషనల్ ఎఫైర్స్ విభాగం పని చేస్తోంది.

– ఆచార్య ధనుంజయరావు, ఇంటర్నేషనల్ ఎఫైర్స్ డీన్, ఆంధ్ర యూనివర్సిటీ

కోర్సుల వారీగా విదేశీ విద్యార్థులు

స్పెషలైజేషన్	యూజీ	పీజీ	పీహెచ్‌డీ	మొత్తం
ఆర్ట్స్	3	44	136	183
సైన్స్ అండ్ టెక్నాలజీ	6	52	38	96
ఇంజినీరింగ్	373	55	44	472
ఫార్మాస్యూటికల్	146	39	20	205
ఇంటర్నేషనల్ బిజినెస్	143	24	-	167
లా	1	5	6	
ఐఏఎస్ఈ	1	1		
మొత్తం	671	216	243	1,130

గత ఆరేళ్లలో అడ్మిషన్లు ఇలా	
2019-20	190
2020-21	262
2021-22	217
2022-23	333
2023-24	338
2024-25	465

భక్తి శ్రద్ధలతో ఈస్టర్



వాల్తేర్ సెమిట్రీలో సమాధులను పూలతో అలంకరించి, కొవ్వొత్తులు వెలిగిస్తున్న చిన్నారులు



సమాధులను పూలతో అలంకరిస్తున్న క్రైస్తవ కుటుంబం

దాబాగార్డెన్స్: ఈస్టర్ పర్వదినాన్ని పురస్కరించుకుని క్రైస్తవులు పెద్ద ఎత్తున ఆదివారం ప్రార్థనలు జరిపారు. నగరంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని వాల్తేర్ సెమిట్రీలో ఈస్టర్ పురస్కరించుకొని సమాధుల వద్ద పెద్ద ప్రార్థనలు నిర్వహించారు. వేకువ జామున 4 గంటల నుంచే ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. చనిపోయిన వారి సమాధులను పూలతో అలంకరించారు. కొవ్వొత్తులు వెలిగించి చనిపోయిన వారిని స్మరించుకున్నారు. వాల్తేర్ సెమిట్రీ అధ్యక్షుడు జార్జ్ చీడి, కార్యదర్శి మ్యాథ్యూ పీటర్, కోశాధికారి థామస్ పుల్లెట్ ప్రార్థనలతో ఉదయకాల ఆరాధన ప్రారంభించారు. క్రైస్తవులు వారి ఆత్మీయుల సమాధుల వద్ద ప్రార్థనలు జరిపారు. నగర పరిధిలోని సెయింట్ ఆంతోనీ చర్చి, ట్రినిటీ లూథరన్ చర్చి, లండన్ మిషన్ చర్చి, బాప్టిస్ట్ చర్చి, సెయింట్ అలోసిస్ చర్చి, సెయింట్ జాన్ ప్యారిస్ చర్చి, కల్వరి బాప్టిస్ట్ చర్చిల్లో ఈస్టర్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక ప్రార్థనలు, గీతాలు ఆలపించారు. చర్చి ఫాదర్లు ఈస్టర్ సందేశాన్నిచ్చారు. పలు ప్రాంతాల్లో ర్యాలీలు నిర్వహించి భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు జరిపారు.





సమాధుల వద్ద ప్రార్థనలు నిర్వహిస్తున్న ఫాదర్లు, కుటుంబ సభ్యులు

నాటి సంస్కరణలే నేటి ఫలితాలు



సంకల్ప బలం ఉండాలే గానీ అసాధ్యాన్ని సుసాధ్యం చేయవచ్చని నిరూపించారు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. ఎంతో దూరదృష్టితో ఆనాడు ఆయన తీసుకున్న నిర్ణయాలు నేడు ఫలితాలను ఇస్తున్నాయి. నాడు-నేడు పేరుతో రూ.కోట్లు ఖర్చు చేసి ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలను కార్పొరేటుకు ధీటుగా తీర్చిదిద్దారు. విద్యాబోధనలోనూ సమూల మార్పులు చేశారు. ఫలితంగా తాజా ఇంటర్ ఫలితాల్లో ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు కార్పొరేట్ విద్యార్థులతో పోటీ పడి మార్కులు సాధించారు. స్టేట్ టాపర్లుగా నిలిచి సత్తా చాటారు.

- ప్రభుత్వ కాలేజీల్లో ఆధునిక సౌకర్యాలు
- విద్యాబోధనలో సమూల మార్పులు
- ఇంటర్‌లో మార్కులతో మెరిసిన విద్యార్థులు
- స్టేట్ టాపర్ల జాబితాలో జిల్లాలో నలుగురికి చోటు
- కార్పొరేట్‌కు దీటుగా రాణించిన విద్యార్థులు
- వైఎస్ జగన్ పాలనను తలచుకుంటున్న తల్లిదండ్రులు



వి.ఎస్.కృష్ణా కళాశాలలో విద్యా బోధన

విశాఖ విద్య/మద్దిలపాలెం: ప్రభుత్వ కాలేజీల్లో చదువుకునే విద్యార్థులు ఫస్ట్‌క్లాస్‌లో పాసైతే ఒకప్పుడు పెద్దగొప్ప. కానీ నేడు పరిస్థితి మారింది. ప్రభుత్వ జూనియర్ కాలేజీల విద్యార్థులు సైతం కార్పొరేట్‌కు తీసుపోమన్నట్లుగా టాప్ మార్కులతో అదరగొట్టారు. 2024-25 విద్యా సంవత్సరంలో జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల విద్యార్థులు మార్కుల్లో మెరిశారు. ఏకంగా నలుగురు విద్యార్థులు స్టేట్ టాపర్ల జాబితాలో చోటు దక్కించుకొని షైనింగ్ స్టార్ పురస్కారాలను అందుకున్నారు. 900లకు పైగా మార్కులు సాధించిన పలువురు విద్యార్థులు తమ చదువుల సారానికి నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన సంస్కరణల ఫలితమేనని బాహాటంగానే చెబుతున్నారు. నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదింటి బిడ్డలు చదువుల్లో రాణించాలనే సంకల్పం, నేడు సత్ఫలితాలు దిశగా సాగుతుండటంపై విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యారంగ నిపుణులు సైతం నాటి పాలనను గుర్తుచేసుకుంటున్నారు.

ప్రభుత్వ కాలేజీలు బాగుండాలనే..

ఒకప్పుడు ప్రభుత్వ కాలేజీలంటే చిన్నచూపు ఉండేది. అందుకనే నిరుపేద కుటుంబాలకు చెందిన పిల్లలు ఉన్నత విద్యవైపు వచ్చేవారు కాదు. దీన్ని గుర్తించిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తన పాలనలో విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చారు. నాడు-నేడులో భాగంగా ప్రభుత్వ పాఠశాలలతో పాటు, జూనియర్ కాలేజీల అభివృద్ధికి సైతం నిధులు కేటాయించారు. జిల్లాలోని భీమునిపట్నం, అగనంపూడి, పెదగంట్యాడ, పెందుర్తి, జైల్ రోడ్‌లోని బాలికల కాలేజీ, డాక్టర్ వీఎస్ కృష్ణా కాలేజీ, ప్రభుత్వ ఒకేషనల్ కాలేజీలో మౌలిక సౌకర్యాలు పెంపొందించేలా రూ.6.2 కోట్లు మంజూరు చేశారు. దీంతో ఆయా కాలేజీల్లో గతంలో ఎన్నడూ లేని రీతిన మౌలిక వసతులు మెరుగుపడ్డాయి.

గతేడాది చదువులే బెస్ట్

ఇంటర్మీడియెట్ ఫలితాల్లో ఫస్టియర్ కంటే, సెకండ్ ఇయర్‌లోనే మెరుగైన ఫలితాలు వచ్చాయి. ఫస్టియర్‌లో జిల్లాలోని ప్రభుత్వ కాలేజీలు మొత్తంగా 34.17 శాతం కాగా, సెకండ్ ఇయర్‌లో 55 శాతం ఫలితాలు వచ్చాయి. అదే ఒకేషనల్ కోర్సుల్లో ఫస్టియర్‌లో 69.9 శాతం కాగా, సెకండ్ ఇయర్ 81.15 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఈ లెక్కన ఈ ఏడాది కంటే గత ఏడాది వరకు సాగిన చదువులతో పడిన పటిష్టమైన పునాదుల కారణంగానే ప్రస్తుత ఫలితాల్లో విద్యార్థులు మెరిసినట్లు విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.

ప్రభుత్వ ఉద్యోగమే లక్ష్యం



ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకూ ప్రభుత్వ పాఠశాల, కళాశాలలో విద్యనభ్యసించాను. ప్రభుత్వ ఉద్యోగమే లక్ష్యంగా డాక్టర్ వి.ఎస్.కృష్ణా ఒకేషనల్ కళాశాలలో ఎలక్ట్రికల్ టెక్నీషియన్ కోర్సు(ఈటీ)లో జాయిన్ అయ్యాను. 979 మార్కులు సాధించడం ఆనందంగా ఉంది. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలను సద్వినియోగం చేసుకుంటే ఉజ్వల భవిత ఉంటుంది.

– ఎం.విజయకుమార్, 979 మార్కులు (ఈటీ)

ఇంజినీరింగ్ కోర్సులో చేరుతా



ఇంజినీరింగ్ కోర్సులో రాణించి ఉన్నత స్థాయిలో నిలవాలన్నదే నా లక్ష్యం. దీంతో వి.ఎస్.కృష్ణా ఒకేషనల్ కళాశాలలో ప్రింటింగ్ టెక్నాలజీలో చేరాను. ఈ కోర్సును పూర్తి చేయడంతో ఇంజినీరింగ్ కోర్సులో చేరడానికి మార్గం ఏర్పడింది. 936 మార్కులు సాధించి రావడం ఆనందంగా ఉంది.

– ఎస్.శిఖిత, 936 మార్కులు(ప్రింటింగ్ టెక్నాలజీ)

పర్యాటక రంగంలో రాణిస్తా



రైల్వేన్యూకాలనీలో గల జీవీఎంసీ హైస్కూల్‌లో ఉన్నత విద్యాభ్యాసం సాగింది. అప్పట్లో అమ్మ ఒడి ద్వారా ప్రోత్సాహం అందింది. పర్యాటక రంగం అంటే చాలా ఇష్టం. ఆ ఇష్టంతోనే వి.ఎస్.కృష్ణా ఒకేషనల్ కళాశాలలో టూరిజం అండ్ ట్రావెల్ టెక్నిక్స్ (టీటీటీ) కోర్సులో చేరాను. ఈ కోర్సులో రాష్ట్ర స్థాయిలో అత్యధికంగా 974 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయి షైనింగ్ స్టార్స్ జాబితాలో నిలిచాను. బీఏ ట్రావెల్ మేనేజ్‌మెంట్‌లో చేరాలనుకుంటున్నాను. ఎంబీఏ పూర్తిచేసి సొంతంగా ట్రావెల్ మేనేజ్‌మెంట్ వ్యాపారం ప్రారంభించాలనుకుంటున్నాను.

–మహేష్ కార్తికేయ, 974 మార్కులు (టీటీటీ)

నితీష్‌కుమార్ రెడ్డికి బీసీసీఐ కాంట్రాక్ట్?

విశాఖ స్పోర్ట్స్: విశాఖకు చెందిన యువ ఆల్‌రౌండర్ కాకి నితీష్‌కుమార్ రెడ్డికి బీసీసీఐ కేంద్ర కాంట్రాక్టు లభించనున్నట్లు బలమైన సంకేతాలు అందుతున్నాయి. తద్వారా విశాఖ నుంచి బీసీసీఐ కాంట్రాక్టు దక్కించుకున్న రెండో ఆటగాడిగా నిలిచే అవకాశం ఉంది. 21 ఏళ్ల నితీష్ ఇటీవల ఆస్ట్రేలియాతో జరిగిన బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ సిరీస్‌తో టెస్టు క్రికెట్‌లో అరంగేట్రం చేశాడు. ఆ సిరీస్‌లో 5 టెస్టులు ఆడి 298 పరుగులు, 5 వికెట్లు తీసి సత్తా చాటాడు. నాలుగో టెస్ట్‌లో తొలి సెంచరీ నమోదు చేశాడు. అంతకుముందు ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ తరపున నిలకడైన ప్రదర్శన చేయడం జాతీయ సెలెక్టర్ల దృష్టిని ఆకర్షించింది. ఆటగాళ్ల ప్రదర్శన ఆధారంగా ఏటా బీసీసీఐ ఇచ్చే కాంట్రాక్టు జాబితాలో నితీష్‌కు 'సీ' గ్రేడ్ కేటాయించే అవకాశం ఉంది. ఈ కేంద్ర కాంట్రాక్టు దేశవాళీ క్రికెటర్లకు ఆర్థికంగా, వృత్తి పరంగా ప్రోత్సాహకరంగా ఉంటుంది.

భగవద్గీతకు యునెస్కో గుర్తింపు హర్షణీయం



ఎంవీ రాజశేఖర్

దాబాగార్డెన్స్: భగవద్గీతను యునెస్కో గుర్తించడం హర్షణీయమని గీతా ప్రచార సమితి ప్రతినిధి, ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్ అన్నారు. కురుక్షేత్ర మహా సంగ్రామంలో శ్రీకృష్ణ పరమాత్ముడు అర్జునుడికి ఉపదేశించిన భగవద్గీత ఆవిర్భవించి వేల సంవత్సరాలు అవుతున్నా.. ఇప్పటికీ భగవద్గీత భక్తి జ్ఞానములతో కూడిన శోభ చెక్కు చెదరలేదన్నారు. ప్రపంచ దేశాలన్నీ విశ్వసిస్తున్న అత్యున్నతమైన ఆధ్యాత్మిక గ్రంథం భగవద్గీతేనన్నారు. ప్రతి ఒక్కరూ ధర్మంగా జీవించాలన్నా.. ధర్మాన్ని ఆచరించాలన్నా భగవద్గీతను అనుసరించాల్సిందేనన్నారు. విశ్వానికంతటికీ ఎన్నో విధాలుగా.. సగటు జీవికి అనేక రకాలుగా దిక్సూచిగా, మార్గదర్శిగా జీవన ప్రయాణంలో భగవద్గీత భాగంగా ఉందని పేర్కొన్నారు. భగవద్గీతను మరచిపోవద్దని, గీతను దాటొద్దని, సంపూర్ణ గీతా సారాంశం తెలుసుకుని జీవించాలని పిలుపునిచ్చారు.

నేడు జీవీఎంసీలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక

దాబాగార్డెన్స్: జీవీఎంసీ ప్రధాన కార్యాలయంతో పాటు అన్ని జోనల్ కార్యాలయాల్లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్టు జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ ఎం.ఎస్.హరేందిర ప్రసాద్ పేర్కొన్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంటల వరకు ఈ కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు.


చారిత్రక సంపద.. చెత్తతో నిండుగా..!



వైజాగ్ బీచ్‌కి వచ్చే సందర్శకుల కళ్లు ముందుగా వెతికేది లైట్ హౌస్ కోసమే. చారిత్రక ఆనవాలకు సాక్షీభూతంగా నిలిచిందీ ఈస్ట్‌పాయింట్ లైట్ హౌస్. 1950 నుంచి వందలాది నౌకలకు దారిచూపించిన ఈ లైట్ హౌస్ చెంతకు వెళ్లాలంటే... ఇదిగో ఇలా చెత్తా చెదారం దారి చూపిస్తోంది. జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది ఇలా నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై పర్యాటకులు మండిపడుతున్నారు.

– సాక్షి, ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

జాతీయ జెండాపై నిర్లక్ష్యం



కలెక్టరేట్ పోర్టుకోపైన ఏర్పాటు చేసిన మువ్వన్నెల జెండా నిర్వహణపై అధికారుల నిర్లక్ష్యం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. సరైన పర్యవేక్షణ లేకపోవడం వల్ల జాతీయ జెండా.. స్తంభం నుంచి రోజురోజుకూ కిందకు దిగుతూ ఉండటం గమనార్హం. కీలకమైన కలెక్టరేట్ వంటి ప్రధాన కేంద్రంలోనే జాతీయ జెండా నిర్వహణ తీరు ఇలా ఉంటే.. ఇతర ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలలో జెండా పట్ల గౌరవం, నిర్వహణ ఎలా ఉంటుందోనని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జాతీయ జెండా పట్ల అలసత్వం తగదని, తక్షణమే అధికారులు స్పందించి జెండాను సరిచేయాలని డిమాండ్ చేస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

తీరంలో సేదతీరిన జనం



ఏయూక్యాంపస్ : భానుడు భగభగ మంటున్నాడు. ఉదయం నుంచే చార్జ్ తీసుకుంటున్నాడు. జనాలు బయటకు రావడానికి భయపడిపోతున్నారు. ఎండకు తోడు ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఎండ వేడిమి నుంచి కాస్త ఉపశమనం పొందేందుకు సాయంత్రం నగరవాసులు సాగర తీరానికి చేరుకున్నారు. చిన్నారులు ఆటపాటలతో, యువత సెల్ఫీలతో సందడి చేశారు. బీచ్ రోడ్డు జనసమ్మర్దంగా మారిపోయింది. నగరవాసులతో పాటు పర్యాటకులు పెద్దసంఖ్యలో బీచ్‌లో దర్శనమిచ్చారు.

లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా మే 20న సమ్మె

- సిటు అఖిల భారత అధ్యక్షురాలు కె.హేమలత



సమావేశంలో మాట్లాడుతున్న హేమలత

దాబాగార్డెన్స్: కార్మిక హక్కులను కాలరాసే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించాలని సీఐటీయూ అఖిల భారత అధ్యక్షురాలు డాక్టర్ కె.హేమలత డిమాండ్ చేశారు. బీజేపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా మే 20న తలపెట్టిన అఖిల భారత సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. డాబాగార్డెన్స్‌లోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సిటు రాష్ట్ర అధ్యక్షుడు ఎ.వి.నాగేశ్వరరావు అధ్యక్షతన ఆదివారం జరిగిన రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో ఆమె మాట్లాడారు. కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చడం పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసమేనని హేమలత విమర్శించారు. పెట్టుబడిదారులకు అనుకూలంగా చట్టాలు మారుస్తూ.. కార్మికులను ఆధునిక బానిసలుగా మార్చే ప్రయత్నం జరుగుతోందని ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వం అదానీ, అంబానీలకు దేశ సంపదను దోచిపెడుతోందని, కార్పొరేట్‌లకు అనుకూలంగా వ్యవహరిస్తూ కార్మిక, కర్షకులకు ద్రోహం చేస్తోందని ఆమె ఆరోపించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ సహా ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వేగవంతం చేయడం దేశ ఆర్థిక సార్వభౌమత్వాన్ని కార్పొరేట్ సంస్థలకు అప్పగించడమేనని విమర్శించారు. కార్మికులకు కనీస వేతనం నెలకు రూ.26 వేలు, కనీస పెన్షన్ రూ.10 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్, స్కీమ్ వర్కర్లను రెగ్యులర్ చేయాలని, స్కీమ్ వర్కర్లకు కనీస వేతనాలు పెంచి, పని భారం తగ్గించాలని కోరారు. మత విద్వేషాలు రెచ్చగొట్టడానికే వక్ఫ్ చట్టంలో మార్పులు చేసిందన్నారు. సిటు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు మాట్లాడుతూ 8 గంటల పని దినాన్ని 12-14 గంటలకు పెంచే ప్రయత్నం జరుగుతోందని, పోరాటాల ద్వారానే హక్కులు సాధ్యమన్నారు. విద్యుత్ ప్రైవేటీకరణను ఆపి, ఛార్జీలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిటు అఖిల భారత ఉపాధ్యక్షురాలు బేబీరాణి, రాష్ట్ర నాయకులు ఉమామహేశ్వరరావు, అజయ్‌కుమార్, కె.సుబ్బరావమ్మ, కె.ధనలక్ష్మి, ముజఫర్ అహ్మద్, రమాదేవి, ఆర్.వి.నర్సింగరావు, ఆర్.కె.ఎస్.వి.కుమార్, డీఎస్‌వీడీ ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

అండర్-7 చెస్ జట్టుకు ధనుష్, ధియా ఎంపిక



ఓపెన్‌లో అభినవ్ ఎత్తుల్ని చిత్తు చేసిన ధనుష్

విశాఖ స్పోర్ట్స్: అండర్-7 అంతర జిల్లాల చదరంగం జట్టు ఎంపిక పోటీల్లో విశాఖకు చెందిన ధనుష్ (ఓపెన్ విభాగం), ధియా తేజశ్రీ బుద్ధ (బాలికల విభాగం) రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారు. వీరు పల్నాడు జిల్లాలో జరగనున్న స్టేట్ అంతర జిల్లాల అండర్-7 చాంపియన్‌షిప్‌లో జిల్లాకు ప్రాతినిధ్యం వహించనున్నారు. ఆల్ విశాఖ చదరంగం సంఘం ఆధ్వర్యంలో గాయత్రి విద్యా మందిర్‌లో ఆదివారం ఈ ఎంపిక పోటీలు జరిగాయి. ఓపెన్ విభాగంలో 23 మంది, బాలికల విభాగంలో 13 మంది చిన్నారులు పోటీ పడ్డారు. ఓపెన్‌లో ఐదు రౌండ్లు, బాలికల కోసం నాలుగు రౌండ్లు నిర్వహించారు. ఓపెన్ విభాగంలో ధనుష్ పిల్ల ఐదు రౌండ్లలో నాలుగున్నర పాయింట్లు సాధించి విజేతగా నిలిచాడు. ద్వితీయ స్థానంలో నిలిచిన అభినవ వైద్య భూషణ నాలుగు పాయింట్లు సాధించాడు. వీరిద్దరూ జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. ఐదు రౌండ్ల తర్వాత బి.విఖ్యాత్, ఎ.కార్తికేయ, నిహాస్ దొగ్గాలు కూడా నాలుగేసి పాయింట్లతో నిలిచినా ప్రోగ్రెసివ్ స్కోరు ఆధారంగా వారు వెనుకబడిపోయారని నిర్వాహకులు తెలిపారు. బాలికల విభాగంలో ధియా తేజశ్రీ బుద్ధ నాలుగు రౌండ్లలోనూ విజయంతో నాలుగు పాయింట్లు సాధించింది. మూడు పాయింట్లు సాధించిన అదిత్రి ద్వితీయ స్థానంలో నిలిచింది. తేజో సన్విక, అదిత్రితో సమానంగా పాయింట్లు సాధించినా.. ప్రోగ్రెసివ్ స్కోరు కారణంగా అర్హత సాధించలేకపోయింది. ఓపెన్, బాలికల విభాగాల్లో తొలి రెండు స్థానాల్లో నిలిచిన విజేతలకు ప్రోత్సాహక నగదు బహుమతులు అందించారు. జిల్లా స్థాయి అండర్-7 ఓపెన్‌లోనూ, బాలికల్లోనూ తొలి రెండు స్థానాల్లో నిలిచిన వారికి జిల్లా జట్టుగా అర్హత కల్పించినట్లు సంఘం కార్యదర్శి మణికంఠ తెలిపారు.

కోణార్క్‌లో డీఆర్ఎం ఆకస్మిక తనిఖీలు

తాటిచెట్లపాలెం: భువనేశ్వర్ నుంచి ముంబయి వెళ్తున్న కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో వాల్తేర్ డివిజన్ డీఆర్ఎం లలిత్ బోరా ఆదివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆన్ బోర్డ్ హౌస్ కీపింగ్ సర్వీసెస్ ద్వారా రైళ్లో ప్రయాణించే ప్రయాణికులకు అందజేసే లినెన్(బెడ్‌రోల్స్) నాణ్యతను పరిశీలించారు. ప్యాంట్రీకార్‌లో అందిస్తున్న పదార్థాల నాణ్యత, పరిసరాల పరిశుభ్రత వంటి సదుపాయాలను పరిశీలించారు. రైళ్లలో అందుతున్న వివిధ భద్రతా ప్రమాణాలను, సదుపాయాల గురించి ప్రయాణికుల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకున్నారు. అదేవిధంగా రైళ్లలో ప్రయాణించేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. ఏదైనా అనుమానిత వస్తువులు, మనుషుల గురించి సమాచారం తెలిస్తే సంబంధిత అధికారులకు లేదా 139 నెంబరుకు తెలియజేయాలని సూచించారు.

బధిర యువతిపై అత్యాచారం?

తగరపువలస: భీమిలి మండలం చిప్పాడ గ్రామ పంచాయతీ పరిధిలో రెండు రోజుల కిందట బధిర యువతిపై స్థానిక యువకుడు అత్యాచారానికి పాల్పడినట్టు తెలిసింది. యువతి ఇంటి సమీపంలో నివసిస్తున్న దివీస్‌లో పనిచేసే యువకుడే ఈ ఘటనకు కారణమని సమాచారం. కానీ ఈ విషయం భీమిలి పోలీస్‌స్టేషన్ వరకు వెళ్లకుండా పంచాయతీ పెద్దలు రెండు రోజులుగా పరిష్కారం పేరుతో కాలయాపన చేస్తున్నారు. బధిర యువతికి న్యాయం చేయాలని పంచాయతీకి చెందిన పలువురు కోరుతున్నారు.

జేఈఈ మెయిన్స్‌లో శ్రీరామానుజ విద్యార్థుల ప్రతిభ



ర్యాంకర్లను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ శివ రామ దత్తాత్రేయ

బీచ్‌రోడ్డు: జేఈఈ మెయిన్స్‌లో పెదవాల్తేరులోని శ్రీరామానుజ జూనియర్ కాలేజ్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శివ రామ దత్తాత్రేయ మాట్లాడుతూ తమ విద్యార్థులు 99.493, 98.709, 98.619, 96.660, 96.454, 95.421 పర్సంటైల్‌తో టాప్ స్కోర్లు సాధించారని తెలిపారు. అలాగే ఫిజిక్స్‌లో అత్యధికంగా 99.738, కెమిస్ట్రీలో 99.717, మ్యాథ్స్‌లో 98.515 పర్సంటైల్ సాధించినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ర్యాంకర్లను ఆయన ఘనంగా సత్కరించారు.

ఉక్కు కేబీఆర్‌లో మహిళ మృతదేహం లభ్యం



బోర్లా పడి ఉన్న మృతదేహం

ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్ కణితి బ్యాలన్సింగ్ రిజర్వాయర్ (కేబీఆర్)-1లో గుర్తు తెలియని మహిళ మృతదేహం బయటపడింది. స్టీల్‌ప్లాంట్ పోలీసులు అందించిన వివరాలివి.. విశాఖ ఇండస్ట్రియల్ వాటర్ సప్లయ్ కంపెనీ (విస్కో)లో పనిచేస్తున్న పెందుర్తికి చెందిన బత్తిన పైడిరాజు (38) ఆదివారం ఉదయం గేటు వద్ద మహిళ మృతదేహాన్ని గమనించాడు. వెంటనే అక్కడి అధికారులకు సమాచారం అందించగా వారు స్టీల్‌ప్లాంట్ పోలీసులకు తెలిపారు. గేటు వద్ద బోర్లా పడి ఉన్న మృతదేహాన్ని గుర్తించారు. ఆమె ముక్కు నుంచి రక్తం బయటకు వస్తుండటం గమనించారు. 50 నుంచి 60 ఏళ్ల మధ్య ఉండే ఆ మహిళ ఒంటిపై పసుపు జాకెట్, తెలుపు రంగు పెట్టీ కోట్ ఉంది. 5 అడుగులు ఎత్తు ఉన్న ఆమె కుడి చేతిపై టాటూ ఉంది. వివరాలకు స్టీల్‌ప్లాంట్ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని పోలీసులు కోరారు.

రుషికొండలో 'ఐకానిక్ సిటీ ఆఫ్ గోల్డ్'



ఐకానిక్ సిటీ ఆఫ్ గోల్డ్ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఐకానిక్ చైర్మన్ మురళీకృష్ణ, ఎండీ సంతోష్

అల్లిపురం: రుషికొండ ఐటీ హిల్స్ 3 సమీపంలో 97 ఎకరాల్లో ఐకానిక్ సిటీ ఆఫ్ గోల్డ్ పేరిట టౌన్‌షిప్ నిర్మిస్తున్నట్లు సంస్థ చైర్మన్ కె.మురళీకృష్ణ, ఎండీ కేఎల్ సంతోష్ వెల్లడించారు. నగరంలోని ఒక హోటల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మొదటి దశలో 4,500 నుంచి 10 వేల చదరపు అడుగుల విస్తీర్ణం గల 180 విల్లాలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. కమర్షియల్ కాంప్లెక్స్‌లు, ఫైవ్ స్టార్ హోటల్, ఐటీ టవర్స్, ప్రీమియం అపార్ట్‌మెంట్స్ వంటి నిర్మాణాలు దశల వారీగా వస్తాయన్నారు. 45 వేల చదరపు అడుగుల్లో విశాలమైన క్లబ్ హౌస్ నిర్మిస్తామన్నారు. విశాఖ, తిరుపతిలో ఫైవ్‌స్టార్ హోటళ్లు అందుబాటులోకి తెస్తామని పేర్కొన్నారు. రియల్ ఎస్టేట్ రంగంలో 25 ఏళ్ల సుదీర్ఘ అనుభవం ఉందని తెలిపారు. అనంతరం వారు ఐకానిక్ సిటీ ఆఫ్ గోల్డ్ బ్రోచర్‌ను ఆవిష్కరించారు.

హాస్య చోర చిత్రం 'చౌర్యపాఠం'

- దర్శకుడు నిఖిల్ గొల్లమూరి



వివరాలు వెల్లడిస్తున్న చిత్ర దర్శకుడు నిఖిల్

ఏయూక్యాంపస్: దొంగతనం చేయడం వల్ల ఎదురయ్యే సమస్యలు, వాటి పరిణామాలను హాస్య ప్రధానంగా చూపుతూ తెరకెక్కిన చిత్రం 'చౌర్యపాఠం'. ఈ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులను నవ్వించి, అలరిస్తుందని చిత్ర దర్శకుడు నిఖిల్ గొల్లమూరి తెలిపారు. నగరంలోని కిర్లంపూడిలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన చిత్ర విశేషాలను వెల్లడించారు. విభిన్నమైన కథాంశంతో ఈ సినిమా ప్రజల ముందుకు రాబోతోందన్నారు. చిత్ర నిర్మాత త్రినాథరావు నక్కిన మాట్లాడుతూ తాను గతంలో పలు చిత్రాలకు దర్శకుడిగా పనిచేశానని చెప్పారు. హీరో ఇంద్రరామ్ మాట్లాడుతూ సినిమాలో టన్నెల్‌లో జరిగే దొంగతనం సన్నివేశం చాలా వినూత్నంగా, హాస్య భరితంగా ఉంటుందన్నారు. హీరోయిన్ పాయల్ రాధాకృష్ణ మాట్లాడుతూ సినిమాలో బ్యాంకు ఉద్యోగి అయిన నేను అనుకోని పరిస్థితుల్లో దొంగల ముఠాలో సభ్యురాలిగా మారే పాత్రలో నటించడం వైవిధ్యంగా అనిపించిందన్నారు. సినిమాలో గ్రామపెద్దగా కీలక పాత్రను పోషించానని చెప్పిన సీనియర్ నటుడు రాజీవ్ కనకాల విశాఖపట్నంతో తనకు ప్రత్యేక అనుబంధం ఉందని వివరించారు.

క్రికెట్ బెట్టింగ్ ముఠాపై టాస్క్‌ఫోర్స్ దాడి

అక్కిరెడ్డిపాలెం: గాజువాక పోలీస్ స్టేషన్ పరిధిలో క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న ముఠాపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఆదివారం రాత్రి జరిపిన ఈ దాడుల్లో పలువురు బెట్టింగ్ నిర్వాహకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అరెస్ట్ అయిన వారి వద్ద నుంచి 23 సెల్ ఫోన్లు, మూడు ల్యాప్‌టాప్‌లను స్వాధీనం చేసుకున్నట్లు గాజువాక పోలీసులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి తదుపరి విచారణ జరుగుతోందని పోలీసులు పేర్కొన్నారు.

విశాఖ బులియన్

24 క్యారెట్స్(10 గ్రా.)	రూ.97,580
22 క్యారెట్స్(10 గ్రా.)	రూ.89,450
వెండి(కిలో):	రూ.1,10,000

చికెన్ ధరలు



చికెన్ (కిలో) (వెన్‌కాబ్)

ఫారం ధర	: రూ.100
బ్రాయిలర్ (లైవ్)	: రూ.120
స్కిన్	: రూ.210
స్కిన్‌లెస్	: రూ.220

కోడిగుడ్ల ధరలు

	రూ.లలో (వందకు)
విశాఖ	425.00
విజయనగరం	429.00
శ్రీకాకుళం	429.00